సాక్షి
ఖమ్మం
ఆదివారం । 26 । నవంబర్ । 2023



రాజకీయాల్లో 'జలగం' ముద్ర

'జలగం' కుటుంబం నుంచి నలుగురు చట్టసభలకు ఎన్నికై ఎమ్మెల్యే మొదలు సీఎం వరకు పదవులు నిర్వర్తించారు. 6లో



ఊసరవెల్లి నేతలను ఓడించండి

రోజుకో పార్టీ మారే ఊసరవెల్లి వంటి నేతలను ఓడించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ కోరారు. 6లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

అందరికీ రాజ్యాంగ ఫలాలే లక్ష్యం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు అందరికీ న్యాయస్థానాల ద్వారా అందించడానికి న్యాయసేవా సంస్థలు కృషి చేస్తున్నాయని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని మానేర్ న్యాయ కళాశాలలో శనివారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. 'అందరికీ అందుబాటులో న్యాయం' అనే నినాదంతో న్యాయ సేవాసంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళలు, పిల్లలు, షెడ్యూల్ కులాలు, తెగల వారు ఉచిత న్యాయ సాయానికి అర్హులని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మోహన్‌రావు, అధ్యాపకులు టి.జయప్రకాష్, మహమూద్ ఖాన్ పటాన్, జి.రత్నాంబ, నామవరపు శ్రీనివాసశర్మ, విజయ్‌బాబు, ఎం.శ్రీనివాసరావు, బి.శ్రావణి పాల్గొన్నారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఈసందర్భంగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకున్నాక పల్లకీ సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని డిపోల నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. డిపోల నుంచి ఆదివారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరే బస్సులు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాల దర్శనం అనంతరం 28న ఉదయం తిరిగి చేరుకుంటాయని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో విజయవాడ, కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం(గోల్డెన్ టెంపుల్) ఆలయాల సందర్శన ఉంటుందని తెలిపారు. అలాగే, అరుణాచల గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం నాలుగు క్షేత్రాలను కలుపుతూ టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉందని ఆర్‌ఎం వెల్లడించారు.

ప్రియాంక రాక.. కాంగ్రెస్‌లో కేక



కాంగ్రెస్ జెండాతో ప్రియాంకా గాంధీ, పక్కన పొంగులేటి, భట్టి, తుమ్మల



ఖమ్మంలో రోడ్‌షోకు హాజరైన జనం, బారులుదీరిన వాహనాలు (ఇన్‌సెట్) నమస్కరిస్తున్న ప్రియాంకాగాంధీ



మధిర సభలో అభివాదం చేస్తున్న ప్రియాంకాగాంధీ, పక్కన భట్టి విక్రమార్క

రోడ్‌షోలు, విజయభేరి సభకు తరలివచ్చిన జనం

- నృత్యం, కోలాటాలతో భారీ స్వాగతం
- మధిర విజయభేరి సభలో ఎక్కువ సేపు ప్రసంగం
- భట్టి, పొంగులేటి, తుమ్మల, రాగమయి సహా అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చిన ఏఐసీసీ అగ్రనేత

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీ రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఎన్నికల ప్రచారం చివరి అంకాన కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించిన రోడ్‌షోలు, మధిరలో నిర్వహించిన విజయభేరి సభకు పార్టీ శ్రేణులు, ప్రజలతోపాటు ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలు హాజరయ్యారు. భారీ ర్యాలీతో ప్రియాంకాగాంధీ నిర్వహించిన రోడ్‌షో, మధిరలో ఏర్పాటు చేసిన విజయభేరి సభ ఆద్యంతం పార్టీలో జోష్ నింపినట్లయింది. హైదరాబాద్ నుంచి శనివారం మధ్యాహ్నం 12.15 గంటలకు హెలీకాప్టర్‌లో సర్దార్ పటేల్ స్టేడియానికి చేరుకున్న ఆమె.. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రోడ్‌షోలో పాల్గొనడంతోపాటు మధిరలో నిర్వహించిన సభకు హాజరయ్యారు. పార్టీ అభ్యర్థులు భట్టి, పొంగులేటి, తుమ్మల, మట్టా రాగమయితోపాటు తమ అభ్యర్థులను గెలిపించాలని శ్రేణులకు ఈ కార్యక్రమాల్లో పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ రావాలని నినదించండి

'కేసీఆర్ మీకు ఉద్యోగాలు ఇచ్చాడా..? కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి, ఉద్యోగాలు కావాలంటే బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపండి'. అని ఆమె పెదతండా వద్ద పార్టీ శ్రేణులనుద్దేశించి పిలుపునిచ్చారు. ఇకనైనా 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అంటూ పార్టీ శ్రేణులతో నినాదాలు చేయించారు. పెదతండా వద్ద కాంగ్రెస్ కార్యకర్త కూతురిని ఎత్తుకుని లాలించారు. ఖమ్మం, పెదతండా, నాయుడుపేట, కల్లూరులో రోడ్‌షోలలో దారి పొడవునా ఉన్న పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తూ కదిలారు.

శ్రీనివాసరెడ్డి, భట్టి, తుమ్మలను గెలిపించాలి..

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో రోడ్‌షోల్లో పాల్గొన్న ప్రియాంక పార్టీ శ్రేణులనుద్దేశించి పెదతండా వద్ద మాట్లాడారు. పాలేరు, ఖమ్మం, మధిర అభ్యర్థులైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్కలను గెలిపించాలని పిలుపునిచ్చారు. దీంతో పార్టీ శ్రేణులు జై కాంగ్రెస్, జై ప్రియాంక అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సత్తుపల్లిని జిల్లాగా ప్రకటిస్తాం..

సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించి కల్లూరులో జరిగిన రోడ్‌షోలో ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ సత్తుపల్లికి మట్టా రాగమయి, దయానంద్ మంచి పనులు చేశారని, ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాగమయిని గెలిపించాలని ప్రజలను కోరారు. సింగరేణిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరిస్తున్న విషయం మీకు తెలుసా అంటూ ప్రజలనుద్దేశించి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సత్తుపల్లిని జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని, ఓట్ల కోసం చాలామంది వస్తారని జాగ్రత్తగా ఆలోచించి మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు.

ప్రజల కోసం భట్టి పాదయాత్ర..

మధిరలో ఏర్పాటుచేసిన విజయభేరి సభలో ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడో యాత్ర మాదిరిగానే తెలంగాణలో ప్రజల కోసం భట్టివిక్రమార్క పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో భట్టి సభకు పోతున్నానని తన తల్లి సోనియాగాంధీతో చెప్పానని, ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల కలలు నెరవేరుతాయని, బలమైన ప్రభుత్వం ఏర్పడుతుందని తన తల్లి ఇక్కడి ప్రజలకు చెప్పమని తెలిపిందన్నారు. ప్రజా సమస్యలపై తాను, తన సోదరుడు పోరాటం చేస్తున్నామని తెలిపారు. మధిరకు రావడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. పాదయాత్ర చేసినందుకు భట్టిని అభినందించిన ప్రియాంక.. మధిర సభలో అర గంటకు పైగా ప్రసంగించారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం..

ఇటీవల మణుగూరులో రాహుల్‌గాంధీ, ప్రస్తుతం ప్రియాంకాగాంధీ ప్రచారంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. అగ్రనేతల పర్యటనలకు శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున హాజరు కావడంతో గెలుపుపై పార్టీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన మూడు రోజులు ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించేలా అభ్యర్థులు, పార్టీ ముఖ్యనేతలు దృష్టి సారించారు. కాంగ్రెస్ మద్దతుతో కొత్తగూడెంలో బరిలో ఉన్న సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ప్రచారంలోనూ ఆ పార్టీ నాయకులే కాక కాంగ్రెస్ ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఇక రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రోడ్‌షోలకు కాంగ్రెస్‌తోపాటు సీపీఐ, టీడీపీ శ్రేణులు కూడా తరలివచ్చాయి.

రోడ్‌షోలు, సభలో పార్టీ అభ్యర్థులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ మట్టా రాగమయి, నేతలు పోరిక బలరాంనాయక్, పోట్ల నాగేశ్వరరావు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, మట్టా దయానంద్, పొంగులేటి ప్రసాదరెడ్డి, తుమ్మల యుగంధర్, తుంబూరు దయాకర్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావెద్, కమర్తపు మురళి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, ఎం.డీ.ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అగ్రనేతకు అపూర్వ స్వాగతం

సర్దార్ పటేల్ స్టేడియంలో హెలీకాప్టర్ దిగిన ప్రియాంకాగాంధీకి పార్టీ నేతలు భట్టి, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు జిల్లా నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆమె జెడ్పీసెంటర్‌కు చేరుకున్న ఆమె ప్రచార రథం ఎక్కి ర్యాలీగా జెడ్పీసెంటర్, వైరారోడ్, పాత బస్టాండ్, కాల్వొడ్డు మీదుగా నాయుడుపేట బ్రిడ్జి వరకు చేరుకున్నారు. ఖమ్మం నగరంలోని పార్టీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలకగా, పాలేరు నియోజకవర్గ శ్రేణులు నాయుడుపేట వద్ద స్వాగతించారు. గిరిజన మహిళలు, ఆదివాసీల నృత్యాలకు తోడు కోలాట బృందాలతో సందడి నెలకొనగా... గిరిజన మహిళలను ప్రియాంకా గాంధీ ప్రచారరథం పైకి పిలిపించి వారితో కలిసి కాసేపు నృత్యం చేశారు. నాయుడుపేట, పెదతండా మీదుగా వరంగల్ క్రాస్‌రోడ్డు వరకు భారీ ర్యాలీ కొనసాగగా, అక్కడ ప్రియాంక మాట్లాడారు.



హెలీప్యాడ్ వద్ద ప్రియాంకకు స్వాగతం పలుకుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మధిర గేటు కూడా తాకలేరు..

మధిర: వంద మంది కేసీఆర్‌లు వచ్చినా మధిర గేటును కూడా తాకలేరని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో జరిగిన విజయభేరి బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మధిర పోరాటాల గడ్డ అని, కేసీఆర్ ఇటీవల పాల్గొన్న సభలో భట్టి విక్రమార్క గెలవడని చెప్పాడన్నారు. కానీ ఎంత మంది వచ్చినా తన గెలుపును అడ్డుకోలేరని.. ఈసారి 50 వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడితే ప్రజలకు మంచి జరుగుతుందని భావిస్తే బీఆర్‌ఎస్ పాలనలో ఎవరికీ మేలు జరగకపోగా ఆ పార్టీ నాయకులే బాగుపడ్డారని తెలిపారు. దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని 78 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని భట్టి తెలిపారు.

వాళ్లొస్తే మళ్లీ చీకటి రోజులే..

ప్రచారంలో మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్, ఎంపీ నామ

రఘునాథపాలెం: కాంగ్రెస్ పాలనలో పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, కాలిపోయిన మోటార్లే కనిపించేవని.. మళ్లీ వారు అధికారంలోకి వస్తే చీకట్లో మగ్గాల్సి వస్తుందని రాష్ట్ర మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తి, గణేశ్వరం గ్రామాల్లో శనివారం రోడ్‌షోల్లో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ అర్ధరాత్రి, అపరాత్రి రైతన్నలు పొలాల్లోకి వెళ్లి పాము, తేలు కాట్లకు బలైన కాంగ్రెస్ ప్రభుత్వ రోజులను మర్చిపోవద్దని సూచించారు. ప్రజలను గోసపెట్టి తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పాలకులు అడుగడుగునా అడ్డుకున్నారని తెలిపారు. ఆతర్వాత కేసీఆర్ దీక్షకు భయపడి తెలంగాణను ఇచ్చారని తెలిపారు. దీంతో ఎండి పంటల స్థాయి నుంచి లక్షల టన్నుల ధాన్యం పండించే స్థాయి రైతులకు తీసుకొచ్చిన సీఎం కేసీఆర్‌ను మరిచిపోవద్దని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఆగొద్దంటే మరోమారు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ నామ మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు తదితర పథకాలను అమలుచేస్తున్న కేసీఆర్ మేలును మరిచిపోకుండా మళ్లీ ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతగుర్తి సర్పంచ్ మెంటం రామారావు, నాయకులుసీతారామయ్య, రామారావు, అజ్మీరా వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎంపీ నామా తదితరులు



భద్రాద్రి జిల్లాకు 200 సీయూలు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఈవీఎం గోదాం నుంచి 200కంట్రోల్ యూనిట్ల (సీయూ)లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అవసరాలకు పంపిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. పార్టీల ప్రతినిధుల సమక్షాన జెడ్పీ ఆవరణలోని గోదాం నుంచి అదనపు సీయూలను తీసి కొత్తగూడెం పంపించామని వెల్లడించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఈవీఎం గోడౌన్ ప్రారంభం



గోదాంను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలో నిర్మించిన ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రత, ఫస్ట్ లెవల్ చెకప్ తదితర అవసరాలకు ప్రస్తుతం నూతన గోదాంను ఉపయోగిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాక ఐదు నియోజకవర్గాల ఈవీఎంలను ఇక్కడే భద్రపరుస్తామని వెల్లడించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాంప్రసాద్, జేఈ విశ్వనాథ్, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

నగదు, మద్యం పంపిణీని అడ్డుకోవాలి..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: శాసన సభ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యాన నగదు, మద్యం పంపిణీని అడ్డుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌ఓలు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు అవకాశం ఉన్నందున నిఘా పెంచాలని సూచించారు. అలాగే, ప్రజలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, రాజేశ్వరి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు విజయకుమారి, హరికిషన్, వీ.వీ.అప్పారావు, సోమశేఖరశర్మ, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ విష్ణు ఎస్.వారియర్

లోపాలు లేకుండా ఎన్నికల విధులు

వైరా/మధిర: ఈనెల 30న జరిగే ఎన్నికల సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. వైరా నియోజకవర్గంలో విధులు కేటాయించిన అధికారులకు శనివారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియ మొత్తాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆతర్వాత మధిరలోని శ్రీనిధి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉద్యోగుల శిక్షణను కూడా కలెక్టర్ గౌతమ్ పరిశీలించి మాట్లాడారు. అర్హులైన ఓటర్లే వచ్చారా, లేదా అనేది పరిశీలిస్తూనే ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చూడాలని సూచించారు. ఈనెల 29న రిసెప్షన్ కేంద్రాల్లో పోలింగ్ సామగ్రి తీసుకుని సెంటర్‌కు వెళ్లాక ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకుని సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. వైరా, మధిర రిటర్నింగ్ అధికారులు బి.సత్యప్రసాద్, జి.గణేష్, సహాయ రిటర్నింగ్ అధికారులు కే.వీ.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధిర మునిసిపల్ కమిషనర్ రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోంది..

- పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చలే లేవు
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



ఎం.వెంకటాయపాలెం సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి, పక్కన తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో ప్రజాస్వామ్యంపై తీవ్రమైన దాడి జరుగుతోందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఖమ్మంలో 'ప్రజాస్వామ్యం ఎన్నికలు – సీపీఎం వైఖరి' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదకర స్థితిలోకి తీసుకొచ్చారని, కొత్త చట్టాలతో మైనార్టీలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే వారిని జైళ్లకు పంపిస్తున్నారని చెప్పారు. దేశ ఆర్థికంగా బాగుందని మోదీ చెబుతున్నా జీడీపీలో షేర్ చూస్తే ఎంత లోటు ఉందో తెలుస్తుందన్నారు. బీజేపీయేతర రాష్ట్రాలకు బకాయిలు చెల్లించడం లేదని, గవర్నర్లతో ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. ఇలాంటి విషయాలపై పార్లమెంట్‌లోనూ చర్చలు జరగకపోగా, ప్రజాసమస్యలపై మాట్లాడే వీలు లేకుండా పోయిందన్నారు. ఈమేరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఎన్నికల్లో మార్పు తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రజల హక్కులను కాపాడడంతో పాటు సమస్యలపై ప్రశ్నించేలా వామపక్ష పార్టీల అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సెమినార్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం అభ్యర్థి యర్రా శ్రీకాంత్, నాయకులు ఎం.సుబ్బారావు, యలమంచిలి రవీంద్రనాథ్, బి.వెంకట్, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

ఖమ్మంరూరల్: కేంద్రంలో మతోన్మాద బీజేపీని కేంద్రంలో ఓడించడమే మార్క్సిస్టు పార్టీ లక్ష్యమని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. పాలేరు సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో శనివారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చే ముందు ఉపాధి, ఉద్యోగాలు అంటూ హామీలు ఇచ్చిన బీజేపీ ఆతర్వాత అన్నింటినీ విస్మరించిందని ఆరోపించారు. రైతుల రుణాలు మాఫీ చేయకపోగా కార్పొరేట్ శక్తులకు మాత్రం రూ.లక్షల కోట్ల అప్పులు మాఫీ చేసిందని మండిపడ్డారు.

ఈ విషయాన్ని గుర్తించి ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటే తమ్మినేని వీరభద్రాన్ని గెలిపించాలని కోరారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ కమ్యూనిస్టులు కొట్లాడితేనే పాలకులు గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇచ్చారని, యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. మున్ముందు ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు తనను గెలిపించాలని కోరారు. ఈసభలో సీపీఎం నాయకులు బి.వెంకట్, నున్నా నాగేశ్వరరావు, బి.రమేష్, పి.సంగయ్య, నంద్ర ప్రసాద్, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఇస్తే ఓట్లు కొనుక్కున్నట్లు కాదా?

- బీజేపీ ఆదేశిస్తేనే ఎన్నికల సంఘం అనుమతించింది
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: పోలింగ్‌కు రెండు రోజుల ముందు రైతుబంధు జమ చేసేలా ఎన్నికల కమిషన్ అనుమతించడం అంటే.. అధికార పార్టీ ఓట్లు కొనుక్కున్నట్లు కాదా అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రశ్నించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుబంధుకు తాము వ్యతిరేకం కాదని.. పోలింగ్ ముగిశాక రైతుల ఖాతాల్లో జమ చేసే అవకాశమున్నా హడావుడి ఎందుకో చెప్పాలన్నారు. బీజేపీ ఆదేశాలతోనే ఎన్నికల కమిషన్ రైతుబంధు అమలుకు అనుమతి ఇచ్చిందని ఆరోపించారు. తద్వారా బీఆర్‌ఎస్, బీజేపీలు ఒకటేనని అర్థమవుతోందని నారాయణ తెలిపారు. కాగా, కేసీఆర్ చావు నోట్లో తలపెడితేనే తెలంగాణ వచ్చిందని చెబుతుండడం అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. అనంతరం భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మన్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ మాట్లాడుతూ ఆమరణదీక్ష చేస్తున్న కేసీఆర్‌ను ఖమ్మం తీసుకురాగా, తొమ్మిది రోజులు ఆయనకు కావాల్సినవన్నీ అందించామని తెలిపారు. కేసీఆర్ దీక్షలు చేసే సమయాన ఆయనకు ఇక్కడ వ్యక్తిగత వైద్యుడిగా తాను పని చేశానని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మహ్మద్ మౌలానా, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో 'జలగం' ముద్ర!

- ఆ కుటుంబం నుంచి చట్టసభల్లోకి నలుగురు
- జెడ్పీ చైర్మన్ మొదలు సీఎం పదవి వరకు సొంతం
- హ్యాట్రిక్ విజయాలతో రికార్డు

సత్తుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనూ జలగం వెంగళరావు పరిచయం అక్కరలేని పేరు. ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, హోంమంత్రి, జిల్లా పరిషత్ చైర్మన్.. ఇలా చెబుతూ పోతే ఎన్నో పదవులు అలంకరించి జిల్లా రాజకీయాలపై ఆయన చెరగని ముద్ర వేశారు. తద్వారా జలగం కుటుంబం ఉమ్మడి జిల్లాలో అందరికీ సుపరిచితమనే చెప్పాలి. డీసీసీబీ చైర్మన్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్, పంచాయితీరాజ్ మంత్రి తదితర పదవులను ఈ కుటుంబంలోని నేతలు నిర్వర్తించారు. జలగం వెంగళరావు సహా కొండలరావు, ప్రసాదరావు, వెంకటరావు ఆ కుటుంబం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

జలగం వెంగళరావు



జలగం వెంగళరావు తొలిసారి 1959లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అలాగే, 1962లో వేంసూరు(ప్రస్తుత సత్తుపల్లి) నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై వరుసగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో హోంమంత్రిగా పనిచేశారు. ఆతర్వాత 1973 డిసెంబర్ 10న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 1978మార్చి వరకు కొనసాగారు. ఆ సమయాన దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో కాంగ్రెస్ పార్టీ చీలిపోగా, జలగం వెంగళరావు ఇందిరాగాంధీతో విబేధించి కాంగ్రెస్(ఆర్)ను స్థాపించారు. 1978 ఎన్నికల్లో గెలుపొందినా రాష్ట్రంలో 30సీట్లకే పరిమితం కావడంతో రాజీనామా చేసి క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. అయితే, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం రాజీవ్‌గాంధీ ఆహ్వానం మేరకు తిరిగి కాంగ్రెస్‌లో చేరి 1986లో ఖమ్మం ఎంపీగా గెలిచి కేంద్ర పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1989లోనూ ఖమ్మం ఎంపీగా రెండోసారి గెలిచిన వెంగళరావు రాజకీయాల నుంచి విరమించుకోగా, 1999జూన్ 12న కన్నుమూశారు.

జలగం కొండలరావు



జలగం వెంగళరావు కుటుంబం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించింది ఆయన సోదరుడు జలగం కొండలరావు. 1957లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఒకసారి, ఖమ్మం ఎంపీగా వరుసగా రెండుసార్లు గెలిచారు.

జలగం వెంకటరావు



జలగం కుటుంబం నుంచి మూడో తరం నాయకుడిగా జలగం వెంకటరావు రాజకీయ అరంగ్రేటం చేశారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో తొలి ప్రయత్నంగానే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో పునర్విభజనతో సత్తుపల్లి ఎస్సీలకు రిజర్వ్‌డ్ కావడంతో ఖమ్మం అసెంబ్లీ స్థానికం కాంగ్రెస్ టికెట్‌ను ఆశించినా దక్కకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2014లో కొత్తగూడెం అసెంబ్లీ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఉమ్మడి జిల్లాలో టీఆర్ఎస్ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఇక 2018 ఎన్నికల్లోనూ కొత్తగూడెం టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినా ఓడిపోయారు. ప్రస్తుతం కొత్తగూడెం నుంచే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి అభ్యర్థిగా వెంకటరావు పోటీలో ఉన్నారు.

జలగం ప్రసాదరావు



1983లో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని తట్టుకుని సత్తుపల్లి ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన ప్రసాదరావు జలగం కుటుంబం సత్తాను చాటారు. 1984లో అసెంబ్లీ రద్దుతో మధ్యంతర ఎన్నికలు జరగగా ఆయన పోటీచేయలేదు. మళ్లీ 1989లో పోటీచేసి విజయం సాధించారు. పంచాయతీరాజ్ శాఖమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. 1994లో ఓడిపోయిన ఆయన, 1999లో ఖమ్మం ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటి నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ జలగం ప్రసాదరావు మద్దతు కోసం రాజకీయ పార్టీల నాయకులు ఆయన చుట్టూ ప్రదక్షణలు చేస్తుంటారు. కాగా, 1983వరకు ఆయన డీసీసీబీ చైర్మన్‌గానూ పనిచేశారు.

ఇంతింతై.. రూ.40 లక్షలై!

నలభై రెట్లు పెరిగిన అసెంబ్లీ ఎన్నికల వ్యయం

- తొలి ఎన్నికల్లో రూ.లక్ష మాత్రమే గరిష్ట పరిమితి
- ప్రతీ రూపాయికి లెక్క పక్కాగా ఉండాల్సిందే..



భద్రాచలం అర్బన్: శాసనసభ ఎన్నికల సమరంలో డబ్బు కీలకపాత్ర పాత్ర పోషిస్తుందన్నది ఎవరూ కాదనలేని అంశం! అయితే, ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన అభ్యర్థులు ఇష్టారీతిన డబ్బు ఖర్చు పెట్టడానికి వీలులేదు. ప్రస్తుత నిబంధనలు అనుసరించి వ్యయపరిమితి గరిష్టంగా రూ.40 లక్షలుగా నిర్ణయించారు. అయితే ఈ వ్యయ పరిమితి తొలినాళ్లలో రూ.లక్ష మాత్రమే ఉండగా ఇంతింతై వటుడింతై అన్నట్లు ఇప్పుడు రూ.40లక్షలకు చేరింది. 1952లో జరిగిన తొలి ఎన్నికల నుంచి చూస్తే నలభై రెట్లు పెరిగినట్లయింది.

నామినేషన్ రోజు నుంచే లెక్క

2014 అసెంబ్లీ ఎన్నికల సమయాన అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.28 లక్షలుగా ఉండేది. ఇక లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించారు. నామినేషన్ వేసిన రోజు నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ప్రతీ ఖర్చును ఎన్నికల వ్యయంగానే పరిగణిస్తారు. అయితే, పార్టీ తరఫున జరిగే సభల ఖర్చును అభ్యర్థి ఖాతాలోకి తీసుకోరు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు చేసే ఖర్చులన్నీ ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారానే నిర్వహించాలి. అందుకోసం నామినేషన్ దాఖలు చేసే నాటికి కొత్త అకౌంట్ ప్రారంభించాలి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లేదా ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తనిఖీల్లో పట్టుబడిన నగదు, ఇతర సామగ్రి ఎవరైనా అభ్యర్థిదని తేలితే ఆ అభ్యర్థుల వ్యయంలో చేరుస్తారు. రోజువారీగా అభ్యర్థులు చేసే వ్యయంతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధన ఖర్చులు, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చులను కలిపి అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతీదానికి బిల్లు సమర్పించాలి. అంతేకాక ఎన్నికల సంఘం నిర్దేశించిన ధరల ఆధారంగా లెక్కలు పరిగణనలోకి తీసుకుంటారు.

పెరుగుతున్న వ్యయపరిమితి

1952 సాధారణ ఎన్నికల సమయాన అభ్యర్థుల వ్యయపరిమితి రూ.లక్షగా ఉండేది. ఇది 1962 నాటికి రూ.3లక్షలకు, 1971 ఎన్నికల్లోరూ.4లక్షలకు, 1975 నాటికి రూ.5 లక్షలు చేరింది. 1984లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా రూ.10 లక్షలకు చేరగా... 1991 నాటికి రూ.12లక్షలకు పెంచారు. ఆతర్వాత 1999లో రూ.15 లక్షలు, 2004 నాటికి రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల వ్యయపరిమితిని నిర్ణయించారు. ఇది ప్రస్తుత ఎన్నికల్లో రూ.40 లక్షలకు చేరుకుంది. కాగా, ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చును రూ.40లక్షలుగా నిర్దేశించిన అంతకు మించి ఎన్నో రెట్లు ఖర్చవుతోందని ప్రస్తుత ప్రచారం తీరును చూస్తే అర్థమవుతోందని పలువురు చెబుతున్నారు.

భైరవునిపల్లి టు ఇంద్రకీలాద్రి..

- పొంగులేటి విజయం కోసం పాదయాత్ర



భిక్షం పాదయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమాని పాదయాత్ర చేపట్టారు. నేలకొండపల్లి మండలంలోని భైరవునిపల్లికి చెందిన కుంచం భిక్షం శనివారం పాదయాత్ర మొదలుపెట్టారు. భైరవునిపల్లి నుంచి ఏపీలోని విజయవాడ శ్రీకనకదుర్గమ్మ ఆలయం వరకు 100 కి.మీ. మేర యాత్ర సాగనుండగా, సీపీఐ గ్రామ కార్యదర్శి పోలంపల్లి నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దపాక గురవమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరికంటి ఉమారాణితో పాటు కనకబండి సీతారాములు, గోళ్ల శ్రీనివాస్, మరికంటి రమేశ్, గండు సైదులు, ఆలేటి మహేశ్, గోపి ఉపేందర్, పెద్దపాక ముత్తయ్య, పోలంపల్లి శ్రీను, పెద్దపాక నాగరాజు పాల్గొన్నారు.

రూ.16 వేల నగదు పట్టివేత

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెంలో శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఓ పార్టీకి చెందిన ఏడు కొండలు, మల్సూర్ జెండాలు, ఓటర్ స్లిప్పులతో పాటు నగదుతో గ్రామంలో తిరుగుతున్నారనే సమాచారంతో తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు వారి నుంచి రూ.16,300 నగదు స్వాధీనం చేసుకోగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.4.50 లక్షలు స్వాధీనం

కొత్తగూడెంటౌన్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద ఐదు కార్లను ఆపి తనిఖీ చేసి, ఆధారాల్లేకుండా రూ.4,50,000 నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీం హెడ్ బి.దేవదాస్ రాథోడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఊసరవెల్లి నేతలను ఓడించండి

- గ్యారంటీలు మాట్లాడేవారికే గ్యారంటీ లేదు
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, నాయకులు

జంగ్ తెలంగాణ

వైరా/కొణిజర్ల: రోజుకో పార్టీ కండువా మార్చుకునే ఊసరవెల్లి నాయకులను ఓడించి ఎర్ర జెండాతో ప్రజల సమస్యలపై పోరాడటంలో మొదటి స్థానంలో నిలిచే సీపీఎం అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ పిలుపునిచ్చారు. వైరా సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు తనికెళ్ల నుంచి వైరా వరకు నిర్వహించిన రోడ్ షోలో ఆమె ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఆ తర్వాత తనికెళ్లలోని ఆఫీస్ సెంటర్, వైరాలోని రింగ్ రోడ్డులో బొంతు రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభల్లో బృందాకారత్ మాట్లాడారు. సీపీఎందీ డబ్బు యాత్ర ఏమాత్రం కాదని తెలిపారు. డబ్బే ప్రధానంగా నిజాయితీ లేకుండా వ్యవహరించే నాయకులను ఓడించాలని కోరారు. పోడు భూముల కోసం భూక్యా వీరభద్రం జైలు జీవితం గడిపితే.. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని చూశా యని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రంగా లను ప్రైవేట్ పరం చేయాలని చూస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే సీతారామ ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు మంచి చేయాలనే చిత్తశుద్ధి వారికి లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, నాయకులు బుర్రి ప్రసాద్, పారుపల్లి ఝాన్సీ, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, విద్యావేత్త ఐవీ.రమణారావు, కొప్పుల కృష్ణయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, చెరుకుమల్లి కుటుంబరావు, తాళ్లపల్లి విజయ, భూక్యా విజయ, వేముల సాంబ, దొడ్డపన్ని కృష్ణార్జున్‌రావు, మోత్కూరి వెంకయ్య పాల్గొన్నారు.



బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో ప్రజలకు ప్రమాదం

బోనకల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలతోపాటు కాంగ్రెస్ అనుసరిస్తున్న విదానాలు దేశప్రజలకు ప్రమాదకరంగా మారాయని.. ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడానికి సీపీఎం అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరముందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. బోనకల్ మండలంలోని రావినూతలలో సీపీఎం మధిర అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఊసరవెల్లి వంటివని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు నల్లచట్టాలను తీసుకొస్తే ఢిల్లీని రైతులు దిగ్బంధనం చేసి విజయం సాదించారన్నారు. ఈ మేరకు పాలక పార్టీలకు బుద్ధి చెప్పి, ప్రశ్నించే సత్తా ఉన్న సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కానీ, సీఐటీయూ జాతీయ కార్యదర్శి మండడపు సాయిబాబు, నాయకులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరావు, పార్థసారది పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న ప్రత్యేక అధికారి



జెడ్పీ సెంటర్‌లో రోప్ పార్టీ

కట్టుదిట్టమైన భద్రత

ఖమ్మంక్రైం: ఏఐసీసీ అగ్రనేత ప్రియాంగాంధీ జిల్లా పర్యటన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కొనసాగింది. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో వచ్చిన ఆమె సర్దార్ పటేల్ స్టేడియంలో దిగారు. ఆ తర్వాత జెడ్పీసెంటర్ నుంచి వైరారోడ్డు, కాల్వొడ్డు మీదుగా పెద్దతండా వరకు జరిగిన రోడ్ షోలో పాల్గొన్నారు. ఆమెకు జెడ్ ప్లస్ భద్రత ఉండడంతో ఢిల్లీ నుంచి బలగాలు భద్రతను పర్యవేక్షించాయి. అలాగే, రోడ్ షో మొత్తం రోప్ పార్టీ నడుమ కొనసాగగా, ప్రచారం రథంపైకి కొద్దిమందినే అనుమతించారు. ఇక దారిపొడవునా ఎస్ఎస్‌జీ కమాండర్లు సోదాలు నిర్వహిస్తూ స్థానికులకు పోలీసులకు సూచనలు చేశారు.

ధాన్యం విక్రయించి వస్తూ మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో రైతు, ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం
- నల్లగొండ జిల్లాలో ప్రమాదం, మృతులు ఖమ్మం జిల్లావాసులు





దీపక్‌కుమార్, సోమ్లానాయక్ మృతదేహాలు

కేతేపల్లి: ధాన్యం విక్రయించి వస్తున్న రైతుతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌ను డీసీఎం రూపంలో మృత్యువు కబళించింది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో జరిగిన ఈ దుర్ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి సమీపంలోని మంగళ తండాకు చెందిన తేజావత్ సోమ్లానాయక్ (57) వానాకాలం సీజన్‌లో పండించిన వరి ధాన్యంను అమ్మేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని శుక్రవారం ఉదయం కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌కు వెళ్లారు. అక్కడ చాముండేశ్వరి రైస్ మిల్లులో ధాన్యం విక్రయించాక శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయాన ట్రాక్టర్‌పైనే తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ వద్ద అండర్ పాస్‌పైకి చేరుకోగానే సూర్యాపేట వైపు వెళ్తున్న అంబులెన్స్ వీరి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. తేరుకుంటుండగానే అదే మార్గంలో అతివేగంగా వచ్చిన డీసీఎం రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న రైతు సోమ్లానాయక్ అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ బాగోతు దీపక్ కుమార్ (30)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు దీపక్‌కుమార్‌ను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు సోమ్లానాయక్ కుమారుడు రాంసింగ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కేతేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

నకిలీ మందులు విక్రయించారని రైతుల ఫిర్యాదు



షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ భాస్కర్‌రావు

రఘునాథపాలెం: మిరప తోటను ఆశించిన ముడత (గుబ్బ) తెగులు, పురుగుల నివారణ కోసం సంప్రదిస్తే నకిలీ మందులు అంటగట్టి మోసం చేశారని మండలంలోని మంచుకొండ రైతులు ఆరోపించారు. ఈ విషయమై శనివారం వారు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కరరావు రంగంలోకి దిగి మురళి కిశోర్ ఆగ్రోస్ దుకాణంలో మందుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. నివేదిక వచ్చే వరకు సదరు కంపెనీ బాధ్యులు మందుల అమ్మకాలు నిలిపేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు కాల్వలో పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఆచార్లగూడెం గ్రామానికి చెందిన కె.నర్సయ్య (48) శనివారం రాత్రి కోనాయిగూడెం వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారు నందిగామ బ్రాంచ్ కెనాల్ వద్ద ఆగిన ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. నీటి ఉధృతి ఉండటంతో కొట్టుకుపోగా, సహచరులు కాపాడేందుకు యత్నించినా ఫలితం కానరాలేదు. చివరకు పవర్ ప్లాంట్ సమీపాన మృతదేహం లభించగా, వెలికి తీశారు.

ఇదీ ఫైనాన్సర్ల నిర్వాకం..

- విద్యార్థులు సహా ఆటో తరలింపు

రఘునాథపాలెం: ఆటోపై తీసుకున్న ఫైనాన్స్ చెల్లించలేదనే కారణంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులు సహా ఆటోను తమ కార్యాలయానికి తీసుకెళ్లిన ఘటన ఇది. రఘునాథపాలెం మండలంలోని బద్యాతండా, ఈర్లపూడి, హర్యాతండా ప్రాంతాలకు చెందిన ఒకటి, రెండు తరగతుల లోపు విద్యార్థులు ఖమ్మంలో చదువుకుంటూ ఆటోలో వెళ్లివస్తున్నారు. అయితే, వారిని తీసుకెళ్లే ఆటోడ్రైవర్ ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేదంటూ శనివారం సాయంత్రం ఆటోను అడ్డుకున్నారు. ఈ సమయాన పిల్లలు ఉండడంతో వారిని ఇంటి వద్ద దించాలని డ్రైవర్ కోరినా వినకుండా విద్యార్థులను సైతం ఖమ్మం రోటరీనగర్‌లోని తమ కార్యాలయానికి తీసుకెళ్లి కూర్చోబెట్టారు. కాసేపయ్యాక వెళ్లిన ఆటోడ్రైవర్ బంధువు విషయాన్ని మీడియాకు చెబుతానని బెదిరించడంతో ఆటో, విద్యార్థులను పంపించారు.

నవ వధువు ఆత్మహత్య

గుండాల: భర్త, అత్త, మామ మానసిక, వరకట్న వేధింపులకు తాళలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి శనివారం మృతి చెందింది. ఎస్సై రతీష్ కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండలం తిర్లాపురం గ్రామానికి చెందిన జోగా విక్రమ్ ఆళ్లపల్లికి చెందిన ప్రసిల (24) ప్రేమించుకున్నారు. నెల రోజుల క్రితమే వివాహం చేసుకున్నారు. అయితే భర్తతోపాటు అత్తామామలు కట్నం తేవాలని, కులాంతర వివాహం చేసుకున్నావంటూ ప్రసిలను వేధింపులకు గురిచేశారు. మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 18న పంటచేనులో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం పలు ఆస్పత్రుల్లో చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం 5 గంటలకు ప్రసిల మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు భర్త విక్రమ్, మామ వెంకన్న, అత్త లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నేలకొండపల్లి వైన్స్‌లో ఖమ్మం మద్యం

అధికారుల తనిఖీలు, కేసు నమోదు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాపులో అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఖమ్మంలోని వైన్స్ పేరిట తీసుకున్న మద్యాన్ని నేలకొండపల్లిలో విక్రయిస్తున్నారనే సమాచారంతో నేలకొండపల్లి సీఐ కుమ్మరి పోశెట్టి ఆధ్వర్యాన శనివారం రాత్రి తనిఖీ చేశారు. తొలుత షాపు బంద్ చేసి రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా అని పరిశీలించగా, ఖమ్మంకు చెందిన 31 కాటన్ల మద్యం ఉన్నట్లు తేల్చారు. ఈ మేరకు 1,488 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకుని యాజమానిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో నేలకొండపల్లి ఎక్సైజ్ ఎస్ఐలు శంకర్, రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మందు కోసం బారులు



వైన్స్ వద్ద క్యూ కట్టిన మందుబాబులు

నేలకొండపల్లిలోని ఓ వైన్స్‌లో తనిఖీల సందర్భంగా అధికారులు షాపును మూసివేశారు. దీంతో పక్కనే ఉన్న మరో వైన్స్ వద్ద మద్యం ప్రియులు బారులుదీరారు. అరుపులు, కేకలతో అక్కడ దద్దరిల్లగా, పలువురు షాపులోకి దూసుకెళ్లే యత్నం చేశారు. ఈ మేరకు పోలీసులు రంగప్రవేశం చేసినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సిబ్బంది వైన్స్ మూసేశారు. అయితే, మందుబాబులు మాత్రం రెండు షాపులు మూసేస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు సర్దిచెప్పి వైన్స్ తెరిపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.